మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 59 | మంగళవారం, 27 జనవరి 2026 | పేజీలు : 4

## ప్రేక్షకులను అలరించిన

# మ్యూజికల్ నైట్

### ఉర్రూతలూగించిన రాం మిర్యాల పాటలు

ప్రముఖ గాయకుడు రాం మిర్యాల బృందం జనగామలోని బతుకమ్మ కుంటలో నిర్వహించిన మ్యూజికల్ నైట్ ప్రేక్షకులను అరించింది. సోమవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో పాటు డీసీపీ రాజ మహేంద్ర నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగామలో ప్రజలకు ఆనందాన్ని పంచే ఇలాంటి కార్యక్రమాల నిర్వాహణకు తాము ఎప్పుడు సహకరిస్తామన్నారు. జనగామ ప్రజలు బతకమ్మ కుంటను కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. దాదాపు రెండు గంట పాటు సాగిన ఈ మ్యూజికల్ నైట్లో సింగర్ రాం మిర్యాల పాడిన పాఠలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.

*- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి*





# అభివృద్ధిలో జనగామ ముందంజ



- కలెక్టర్ రిజ్వాన్ బాషా
- ఘనంగా గణతంత్ర వేడుకలు
- కలెక్టరెట్, ధర్మ కంచ మినీ స్టేడియంలో జెండా ఆవిష్కరించిన కలెక్టర్
- పోలీసుల గౌరవ వందన స్వీకరణ
- జిల్లా అభివృద్ధి పైన సందేశం

2

జనగామ జిల్లా అభివృద్ధిలో ముందంజలో ఉందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. సోమవారం77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జిల్లాలో ఘనంగా జరిగాయి. ముందుగా కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా జాతీయ జెండా ను ఆవిష్కరించి.. అనంతరం స్థానిక స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకలకి హాజరయ్యారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ నిర్వహణ ముగిసిన అనంతరం జిల్లా లోని వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి గురించి సమగ్ర సందేశాన్ని ఇచ్చారు.

*-మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి*





# అభివృద్ధిలో జనగామ ముందంజ

- కలెక్టర్ రిజ్వాన్ బాషా
- గణతంత్ర వేడుకలు
- కలెక్టరెట్, మినీ స్టేడియంలో జెండా ఆవిష్కరించిన కలెక్టర్
- పోలీసుల గౌరవ వందన స్వీకరణ
- జిల్లా అభివృద్ధి పైన సందేశం



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** జనగామ జిల్లా అభివృద్ధిలో ముందంజలో ఉందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జిల్లాలో ఘనంగా జరిగాయి. ముందుగా కలెక్టరేట్ లో కలెక్టర్ రిజ్వాన్ బాషా జాతీయ జెండా ను ఆవిష్కరించి.. అనంతరం స్థానిక స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకలకి హాజరయ్యారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ నిర్వహణ ముగిసిన అనంతరం జిల్లా లోని వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి గురించి సమగ్ర సందేశాన్ని ఇచ్చారు. చేనేత రుణ మాఫీ పథకం కింద 293 మంది లబ్ధిదారులకు రూ.2,06,25,000 చెక్కుని అందించారు. ఆ తర్వాత వివిధ పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. వివిధ శాఖలలో ఉత్తమ సేవలందిస్తున్న జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులకు, వారి సిబ్బందికి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందించారు. చివరగా పోలీస్, వ్యవసాయం, ఉద్యనవన, జిల్లా గ్రామీణభివృద్ధి, మెప్మా, తదితర శాఖల వారు పెట్టిన స్టాల్స్ ని కలెక్టర్, అదనపు కలెక్టర్లు, డీసీపీ పరిశీలించి ఏర్పాటు తీరును అభినందించారు. కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజ్వశ్వర్ రెడ్డి, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, బెన్ షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఆర్డీవోలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.







## ఉత్తమ సేవలకు పురస్కారం..













# మామిడి రామారెడ్డికి పద్మశ్రీ పురస్కారం

## పాడి రంగానికి దిశానిర్దేశం చేసిన నేత రామారెడ్డి



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** దేశంలోని పాడి పరిశ్రమ, మహిళా సహకార ఉద్యమాల అభివృద్ధికి జీవితాంతం అంకితభావంతో సేవలందించిన ప్రముఖ సహకార ఉద్యమ నాయకుడు మామిడి రామారెడ్డికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారం దక్కడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా మారింది. ముఖ్యంగా హనుమకొండ జిల్లా, ముల్కనూర్ పరిసర ప్రాంతాల్లో మహిళా రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ సందర్భంగా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

**రైతాంగం కష్టాలే ప్రేరణ**

ఇబ్బందుల్లో ఉన్న రైతులు, పాడి రైతులు, సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితులను సమీపంగా చూసిన రామారెడ్డి, గ్రామీణ మహిళలే అభివృద్ధికి మూలమని నమ్మారు. ఆ నమ్మకంతోనే మహిళలను ఆర్థికంగా స్వావలంబన దిశగా నడిపించేందుకు సహకార ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు.

**ముల్కనూర్ మహిళా డెయిరీ**

ముల్కనూర్ మహిళా డెయిరీ స్థాపనలో కీలక పాత్ర పోషించిన రామారెడ్డి, పాడి రైతు మహిళలకు గౌరవం, ఆదాయం, ఆత్మవిశ్వాసం కల్పించారు. పాల సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అంశాల్లో మహిళల ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని పెంచి, వేలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపారు. ఈ డెయిరీ నేటికి సహకార రంగంలో ఒక ఆదర్శంగా నిలిచింది.

**పొదుపు ఉద్యమానికి బలమైన పునాది**

2003లో చిన్న స్థాయిలో మహిళా పొదుపు ఉద్యమాన్ని ప్రారంభించిన రామారెడ్డి, కాలక్రమేణా దాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించారు. మొదట కేవలం రూ.11తో ప్రారంభమైన పొదుపు వ్యవస్థ నేడు వందల కోట్ల రూపాయల లావాదేవీలకు ఎదగడం ఆయన దూరదృష్టికి నిదర్శనం.

**కరువు ప్రాంతాల్లో మహిళలకు అండ**

భీమదేవరపల్లి వంటి కరువు ప్రభావిత ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి, ఉపాధి అవకాశాలు కల్పించారు. ముస్తాఫాపూర్, ముల్కనూర్ తదితర గ్రామాల్లో మహిళా పొదుపు సంఘాలు విజయవంతంగా కొనసాగుతూ అనేక కుటుంబాలకు ఆర్థిక భరోసా అందిస్తున్నాయి.

**రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన సేవలు**

కరీంనగర్, వరంగల్, నర్సంపేట, జనగాం వంటి పలు జిల్లాల్లో మహిళా సహకార సంఘాలు బలంగా పనిచేస్తున్నాయి. పాడి పశుసంవర్ధక రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చారు.

**సహకార ఉద్యమానికి దక్కిన గౌరవం**

పాడి పశుసంవర్ధక రంగంలో, మహిళా సాధికారతలో చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం రామారెడ్డికి పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. ఇది వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా, మహిళా సహకార ఉద్యమానికి లభించిన గౌరవంగా పలువురు అభిప్రాయపడుతున్నారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**

ఈ పురస్కారం ప్రకటించగానే సహకార రంగ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు, పాడి రైతు మహిళలు రామారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన సేవలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.



# బీఆర్ఎస్ ఆఫీస్‌లో గణతంత్ర వేడుకలు

**జనగామ, మన చౌరాస్తా :** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బీఆర్ఎస్ జనగామ జిల్లా కార్యాలయం జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి అనేక సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో ప్రజలు స్వాతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల స్ఫూర్తిని క్రమంగా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 26 అంటే పుస్తకాలలో రాసుకుంటాం, చదువుకుంటాం గానీ, దాని వెనుక ఉన్న స్ఫూర్తిని జీవితంలో అమలు చేయడం మరిచిపోతున్నామని అన్నారు. ఈ రోజు మనం స్వేచ్ఛగా మాట్లాడగలుగుతున్నామంటే, అనేక రిజర్వేషన్లు పొందగలుగుతున్నామంటే, ఉద్యోగాలు సంపాదించి జీవనం కొనసాగించగలుగుతున్నామంటే దానికి ప్రధాన కారణం భారత రాజ్యాంగమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** సమాజంలో ప్రాథమిక హక్కులు హక్కులకు భంగం వాటిల్లకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని సాదిక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ సాదిక్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించడంతో పాటు చదువు విలువలను తద్వారా కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా రాబోయే ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి సంవత్సరం విద్యార్థులకు రూపాయలు 5000/, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రూపాయలు 7500/నగదు పురస్కారాన్ని సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తామని ప్రకటించారు. కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవ ప్రశంసా పత్రం అందుకున్న తెలుగు అధ్యాపకులు వీరస్వామి, పి.డి.రాజులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. అనిల్ బాబు, కోఆర్డినేటర్ వీరస్వామి, అధ్యాపకులు నాన్ టీచింగ్ స్టాఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## బావుపేటలో కేఎంసీ ఆధ్వర్యంలో

# ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రాం

**ఎల్కతుర్తి, మన చౌరాస్తా :** ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో కాకతీయ మెడికల్ కళాశాల (కెఎంసి), హనుమకొండకు చెందిన కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రాం ద్వారా వైద్య విద్యార్థులు, డాక్టర్లు ఒక నిర్దిష్ట కుటుంబాలను దత్తత తీసుకుని వారి ఆరోగ్య పరిస్థితులు, జీవనశైలి, ఆహార అలవాట్లు, పరిశుభ్రత, వ్యాధుల నివారణ వంటి అంశాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తారు. దీని ద్వారా కుటుంబాలకు ముందస్తు వైద్య సూచనలు అందడంతో పాటు చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యేలోపే నివారించే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బత్తిని రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఆరోగ్య అవగాహన లోపం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో కెఎంసి వంటి వైద్య కళాశాలలు గ్రామాలను దత్తత తీసుకుని ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెరిగి, ఆరోగ్యకరమైన జీవనశైలికి బాటలు పడతాయని అన్నారు. అనంతరం ఉపసర్పంచ్ మేకల బాబు మాట్లాడుతూ, స్మార్ట్‌ఫోన్ వాడకం పెరిగినా సరైన ఆరోగ్య సమాచారం గ్రామీణ ప్రజలకు అందుబాటులో లేకపోవడం వల్ల ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ప్రత్యక్షంగా ఇంటింటికి వెళ్లి వైద్య సూచనలు, పరిశుభ్రత, పోషకాహారం, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించడం వల్ల ప్రజలకు విశ్వసనీయమైన సమాచారం అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెఎంసి మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్లు, వైద్య విద్యార్థులు, గ్రామ వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






# కొమురవెల్లిలో ఘనంగా గణతంత్ర వేడుకలు

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండల కేంద్రంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛలు కల్పించిందని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, దేశాభివృద్ధికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు, యువత, పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, జనగామ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా కొనసాగాయి. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్, టౌన్ అధ్యక్షులు లింగంపల్లి కనకరాజు, పిఎసిఎస్ డైరెక్టర్ బత్తిని నరసింహులు, కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ధర్మకర్త సార్ల లింగం,బిసి సెల్ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్,స్వాములపల్లి రమేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏర్పుల రాజు,రసూలబాద్ గ్రామ శాఖ అధ్యక్షులు జనగాం శ్రీకాంత్, దొడ్ల విష్ణుమూర్తి,గీస లింగం, లింగంపల్లి సురేష్,ముత్యం ఆంజనేయులు, పబ్బోజు శ్రీనివాస్, లింగంపల్లి మహేష్,గజ్జె అశోక్,వడ్డురి రవి, రమేష్ పాల్గొన్నారు.




తెలంగాణ మార్బుల్ టైల్స్ & పాలిష్ బండల కార్మిక సంఘం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
మంగళవారం, 27 జనవరి 2026
Mana Chourasta


# రంగాయపల్లికి 33 గుంటల భూవిరాళం

- లక్కిరెడ్డి తిరుపతి రెడ్డిని ఘనంగా సత్కరించిన మంత్రి పొన్నం



**హనుమకొండ, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలం రంగాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మహిళలు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు గ్రామానికి 40 లక్షల రూపాయల విలువైన 33 గుంటల భూమిని విరాళంగా అందించిన లక్కిరెడ్డి తిరుపతి రెడ్డిని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తిరుపతి రెడ్డి గారు తన స్వంత భూమిని గ్రామ అవసరాల కోసం విరాళంగా ఇవ్వడం అభినందనీయమని అన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు సౌకర్యంగా బతుకమ్మ ఆడుకునేందుకు ఈ స్థలాన్ని ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేసే పూర్తి బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న 172 గ్రామాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, నూతనంగా ఎన్నికైన సర్పంచుల నుంచి అభివృద్ధి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం మండల స్థాయిలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. రాబోయే ఎండాకాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, ఏ గ్రామంలోనైనా నీటి ఇబ్బందులు ఉంటే వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులు సంబంధిత సమస్యలపై నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే హనుమకొండ జిల్లా పరిధిలో గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల భూసేకరణకు 50 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. కాలువల నిర్మాణానికి రైతులు భూమి ఇచ్చి సహకరించాలని కోరుతూ, భూసేకరణ పూర్తయితే గౌరవెల్లి ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి హుస్నాబాద్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి అవకాశాలకు హుస్నాబాద్ నియోజకవర్గంలో అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండల రజని, ఉప సర్పంచ్ రజిత, సర్పంచులు గజ్జల సృజన కేతిరి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు బహుమతులు ప్రదానం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** గణతంత్ర దినోత్సవం శుభసందర్భంగా గట్ల నర్సింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులచే దేశభక్తి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి సాయికాంత్ గారు తన తండ్రి వడ్డేపల్లి కనుకయ్య గారి స్మారకార్థంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులను ప్రోత్సహించే విధంగా చేసిన ఈ సేవను గ్రామస్తులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అజయ్ కుమార్, ఉప సర్పంచ్ బోడిగే శ్రీను, గ్రామ వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆటో యూనియన్ అధ్యక్షుడిగా రమేష్



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని హుజురాబాద్ అడ్డా ఆటో యూనియన్ ఎన్నికలు సోమవారం నాడు నిర్వహించగా, యూనియన్ సభ్యులు మాడుగుల రమేష్‌ను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా చిదురాల రాజ్ కుమార్, కార్యదర్శిగా మిడిదొడ్డి రాజు, కోశాధికారిగా బండి సారయ్యను ఎంపిక చేశారు. అలాగే యూనియన్ సలహాదారులుగా గంగిరెడ్డి బిక్షపతి, బొల్లంపల్లి మనోహర్, మాడుగుల ప్రభాకర్, గంగిరెడ్డి కుమార్, మహమ్మద్ జబ్బార్ తదితరులను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాడుగుల రమేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకం కారణంగా ఆటో డ్రైవర్లు తీవ్ర ఉపాధి సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయం గణనీయంగా తగ్గిపోవడంతో ఫైనాన్స్‌లు చెల్లించలేక అనేక మంది ఆటో డ్రైవర్లు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. ఆటో డ్రైవర్ల జీవనోపాధి పరిరక్షణకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక పథకాన్ని రూపొందించి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.




# మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**దూల్మిట్ట, మన చౌరాస్తా :** ధూల్మిట్ట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటుచేసిన నూతన మినరల్ వాటర్ ప్లాంట్ ను భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం రోజు ప్రారంభించారు. గతంలో దూల్మిట్ట పాఠశాలకు ఇచ్చిన హామీ మేరకు తన ఎంపీ నిధుల నుండి 1 లక్ష20వేల రూపాయల నిధులతో ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తాగునీటి అవసరాలను తీర్చడానికి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ అనుమల కరుణాకర్ రెడ్డి , దూళిమిట్ట గ్రామ సర్పంచ్ లీలా జగన్మోహన్ రెడ్డి , ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు,గ్రామ సర్పంచ్ లీలా జగన్మోహన్ రెడ్డి ,నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**ఎంపీకి దుబ్బతండా వాసుల వినతి**

దుబ్బతండ గ్రామపంచాయతీలో 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్వాడి కేంద్రాలు, మహిళా సమాఖ్య భవనం నిర్మాణం కోసం గ్రామపంచాయతీలో ప్రభుత్వ భూమి లేనందున దాతలు ముందుకు రావాలని కోరారు. అలాగే శానిటేషన్, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని తీర్మానించారు. పంచాయతీకి భూమి విషయంలో దాతలు ఎవరు ముందుకు రాకపోవడంతో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేశారు.





# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**మద్దూరు మన చౌరాస్తా :** మద్దూరు మండలం గాగిళ్ళాపుర్ గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా శ్రీ షిరిడి సాయిబాబా టెంపుల్ ట్రస్ట్ చైర్మెన్ తౌటి భూమయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం హరిప్రసాద్ మాట్లాడుతూ 76 సంవత్సరాల గణతంత్ర భారతదేశం ఎన్నో మైలురాళ్లను దాటుకొని అభివృద్ధి దశలో దూసుకుపోతుందని మరియు భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా, ఆర్థిక సామాజిక రక్షణ వ్యవస్థలుగా రూపొందాలని ఆకాంక్షించారు. నేటి బాలలే రేపటి పౌరులు విద్యార్థిని విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకొని ఎదగాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పంచాయితీ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, అంగన్వాడీ టీచర్లు, వార్డ్ సభ్యులు, యువకులు, విద్యార్థుల తల్లదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ అంగన్ వాడీ హెల్పర్‌గా స్వరూప



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామంలో ఉన్న అంగన్వాడి ఆరవ సెంటర్‌లో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న పుల్ల స్వరూపను ఉత్తమ అంగన్వాడి హెల్పర్‌గా ఎంపిక చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ చేతుల మీదుగా స్వరూపకు ప్రశంస పత్రం అందజేశారు. అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల సంక్షేమం, గర్భిణీ మహిళలు, బాలింతల సేవలలో స్వరూప అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డు అందించారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**